బాబు పుడితే వారసుడొచ్చాడని మురిసిపోతారు. పాప పుడితే మహాలక్ష్మి అని పొంగిపోతారు. ఎదిగే క్రమంలో ఆ బాబు.. బాబుకాదనో, ఆ పాప.. పాపకాదనో తెలిస్తే.. హఠాత్తుగా పరిస్థితి మారిపోతుంది. ఆ బంధాలకు బీటలు పడతాయి. ఆంక్షలు మొదలవుతాయి. చెట్టంత బిడ్డల్ని పట్టుకుని 'ఆడంగి వేషాలు ఏమిటి', 'మగరాయుడి మాటలు ఏమిటి' అంటూ మాటల కత్తులతో మనసుకు గాయాలు చేస్తారు. కుత్తుక చుట్టూ చేతులు బిగించి 'అడుగు బయటికేస్తే జాగ్రత్త' అంటూ కన్నెర్ర చేస్తారు. ఆ పరిస్థితులలో.. ఇంట్లో ఉన్నా ఇబ్బందులే, బయటికెళ్లినా సమస్యలే. అయినా, ఎక్కడికని వెళ్తారు? ఎవరు ఆశ్రయమిస్తారు? హైదరాబాద్‌లోని క్యూటీ సెంటర్ ఆ బాధ్యత తీసుకుంటున్నది. తక్షణం నీడనిచ్చి, తగినంత భరోసానిచ్చి, న్యాయ సలహా అందించి.. ఆ బతుకులు అన్యాయమైపోకుండా కాపాడుతున్నది.

కవర్ స్టోరీ

# థ్యాంక్స్ టు... ట్రాన్స్ సెంటర్!



... నాగవర్ధన్ రాయల

**ఆ అమ్మానాన్నలకు** పండంటి బిడ్డ. జననాంగాలను బట్టి మగబిడ్డా, ఆడబిడ్డా అన్నది (సిస్ జెండర్) నిర్ణయిస్తారు కాబట్టి, ఆ బిడ్డకు 'మగ' లింగాన్ని ఆపాదించి సంపత్ (మార్చిన పేరు) అని పేరు పెట్టారు. తల్లిదండ్రులు కూడా బయటికి కనిపించే లక్షణాలను బట్టి అబ్బాయి అనే అనుకున్నారు. సంపత్‌కు అబ్బాయిల దుస్తుల్నే కొనిచ్చేవారు. మగవాళ్ల అలవాట్లే నేర్పించారు. 'మగపుట్టుక మరి!' అని మురిసిపోయారు. సంపత్‌కు మాత్రం అమ్మాయిలా ఉండాలని కోరిక. బయటే కాదు.. నాలుగు గోడల మధ్య కూడా.. చీరకట్టుతో, కుంకుమ బొట్టుతో సింగారించుకుంటే ఒప్పుకొనేవాళ్లు కాదు. ప్యాంట్, షర్ట్.. సంపత్‌కు ఇరుకిరుకుగా అనిపించేవి. సమాజం కోసం, కుటుంబం కోసం ఇష్టంలేని దుస్తులు ధరించినా.. ఎవరూ లేనప్పుడు మాత్రం ఆడపిల్లలా ముస్తాబు చేసుకునేవాడు. ఆ అందాన్ని అద్దంలో చూసుకుని మురిసిపోయేవాడు. లిప్‌స్టిక్ రాసుకునేవాడు. సంపత్ పెదాలు ఎర్రగా కనిపించిన ప్రతిసారీ 'మగపిల్లలు రాసుకోకూడదు' అంటూ గద్దించేవారు తల్లిదండ్రులు. 'ఆ ఆడంగి నడక మార్చుకో' అని హెచ్చరించేవారు. ఎంత చెప్పినా వినకపోయేసరికి.. తిట్టేవారు, కొట్టేవారు, దారుణంగా హింసించేవారు. అన్ని అవరోధాల మధ్య కూడా 'ఈ శరీరం నాది కాదు. ఏ ల్యాండ్రీకో ఇచ్చినప్పుడు.. ఒకరి దుస్తులు మరొకరికి వచ్చినట్టు.. ఈ మగ శరీరమూ నాకొచ్చింది' అని బాధపడేవాడు సంపత్.